నేడు జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలలో జిల్లా అథ్లెటిక్స్ ఎంపిక పోటీలను ఆదివారం నిర్వహించనున్నారు. ఉదయం 8 గంటల నుంచి ఈ పోటీలను నిర్వహించనున్నామని అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, కడారి రవి ఓ ప్రకటన తెలిపారు. ఈ పోటీలను అండర్-14, 16, 18, 20 వయస్సు విభాగాల్లో బాలబాలికలకు నిర్వహించనున్నామన్నారు. ఈ నెల 18, 19న నిర్వహించే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు.

ఘనంగా అన్నకూటోత్సవం


అన్నకూటోత్సవం నిర్వహిస్తున్న పండితులు

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని మార్కెట్‌రోడ్ వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం సుప్రభాత, అన్నకూటోత్సవ సేవలు ఘనంగా జరిగాయి. అనంతరం యాగశాలలో సుదర్శన హోమం జరిగింది. హోమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ సతీమణి మంజులతోపాటు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఉదయం శ్రీవారు సింహవాహనంపై, సాయంత్రం హనుమత్ వాహనంపై ఆలయ మాడ వీధుల్లో ఊరేగారు. రాత్రి ఉత్సవ మూర్తుల ముందు సహస్ర దీపాలంకరణ సేవ నేత్రపర్వంగా కొనసాగింది.

● **నేటి కార్యక్రమాలు**

ఆదివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మహాపూర్ణాహుతి, వసంతోత్సవం, చక్రస్నానం నిర్వహిస్తారు. సాయంత్రం 5 గంటల నుంచి శ్రీపుష్పయాగం, ద్వాదశారాధన, సప్తావరణాలు, ధ్వజావరోహణ, ఏకాంతసేవ, పండిత సన్మానం, మహదాశీర్వచనం ఉంటుంది.

కన్నుల పండువగా మత్స్యగిరీంద్రస్వామి కల్యాణం

శంకరపట్నం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి కల్యాణం శనివారం కన్నుల పండువగా జరిగింది. రు. స్వామివారి కల్యాణానికి పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు దేవాలయ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి, ఈవో సుధాకర్ అందజేశారు. స్వామి వారి కల్యాణం వీక్షించడానికి వచ్చిన భక్తులు పట్టు వస్త్రాలు, తలంబ్రాలు, కట్న కానుకలు స్వామివారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ చైర్మన్ ఉప్పుగళ్ల మల్లారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యాలు కల్పించారు. స్వామివారి కల్యాణ మహోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేశవపట్నం ఎస్ఐ కొత్తపల్లి రవి ఆధ్వర్యంలో బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణప్రసాద్, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గోపగోని బసవయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి పాల్గొన్నారు.


కొత్తగట్టులో శ్రీమత్స్యగిరీంద్రస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

రేవంత్‌రెడ్డి హామీలేమయ్యాయి...


పట్టభద్రుల సంకల్ప యాత్ర ర్యాలీలో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతున్న కేంద్ర మంత్రి బండి సంజయ్

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చేది గాడిద గుడ్డే...
- బీసీ జనాభాను తగ్గించడం పెద్ద కుట్ర...
- ముస్లింలను బీసీ జాబితాలో చేర్చితే ఊర్కొనేది లేదు
- కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు బీజేపీకి పట్టం కట్టండి
- కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్

7

విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

భగత్‌నగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ విమర్శించారు. శనివారం నగరంలోని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి సంవత్సరం గడిచినా విద్యారంగానికి ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యారంగానికి 15 శాతం రాష్ట్ర బడ్జెట్‌లో నిధులు ఇస్తామని చెప్పి మాట తప్పిందని విమర్శించారు. ఖాళీగా ఉన్న ఎంఈవో, హెడ్‌మాస్టర్, ఉపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని శాతవాహన యూనివర్సిటీలో ప్రొఫెసర్ పోస్టులు 40 శాతానికి పైగా ఖాళీగా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు నాగుల శ్రీజ, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్కటూరి షాక్, నాయకులు శివ, కవిత, అంజలి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్

ప్రతిష్ఠాత్మకంగా ఎమ్మెల్సీ ఎన్నికలు



- కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ప్రయత్నాలు
- ఆసక్తి చూపని బీఆర్ఎస్ ● రేపటితో ముగియనున్న నామినేషన్లు



పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నామినేషన్లు సోమవారంతో ముగియనున్నాయి. బీఆర్ఎస్ ఈ ఎన్నికలకు దూరంగా ఉండనుంది. పట్టభద్రుల స్థానంలో బీజేపీ, కాంగ్రెస్ ఇప్పటికే తమ అభ్యర్థులను ప్రకటించి ప్రచారంపై దృష్టి పెట్టాయి. పలువురు స్వతంత్ర అభ్యర్థులుగా బరిలోకి దిగారు. సిట్టింగ్ స్థానాన్ని కాపాడుకోవాలని కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. నియోజకవర్గంలో 3.5 ఓటర్లు ఉండగా 50 శాతం మంది ఉమ్మడి జిల్లాలోనే ఉన్నారు. దీంతో అభ్యర్థులు, పార్టీలు జిల్లాపై దృష్టి సారించారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బీజేపీ మల్క కొమురయ్యను రంగంలోకి దింపింది. కాంగ్రెస్ ఎవరికి మద్దతిచ్చేది ఇంకా ప్రకటించలేదు.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్

6

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో గంజాయి స్వాధీనం
6

నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం
6

తప్పుల తడకగా బీసీ కులగణన
● మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య
8

ఖైదీలకు టీబీపై అవగాహన

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లా జైలులో ఖైదీలకు టీబీ వ్యాధిపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా జైలు సూపరింటెండెంట్ జి విజయ్‌డేని ఆధ్వర్యంలో అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా టీబీ కోఆర్డినేటర్ ఇ అశోక్ టీబీ వ్యాధి రాకుండా, వచ్చిన తరువాత తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య అధికారి కె వేణు గోపాల్, జైలర్లు పి శ్రీనివాస్, బీ రమేష్, డిప్యూటీ జైలర్లు ఎ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ సుధాకర్‌రెడ్డి, ఎల్ రమేష్, అజయ్‌చారి, సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో విలీనమైన కొత్తపల్లి మున్సిపాలిటీతోపాటు చింతకుంట, మల్కాపూర్, గోపాల్‌పూర్, బొమ్మకల్, దుర్శేడ్ గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులు, ఉద్యోగులను ఆదేశించారు. శనివారం ఆమె విలీన గ్రామాల్లో పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. పారిశుధ్యం మరింత మెరుగుపడేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

పంట రక్షణకు రైతుల పాట్లు

- మొక్కజొన్నను ధ్వంసం చేస్తున్న అడవిపందులు
- రక్షణగా సోలార్ కంచెలు, మైక్‌ల ఏర్పాటు

సైదాపూర్, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): సైదాపూర్ మండలం మెట్ట ప్రాంతం కావడంతో ఈ యాసంగిలో రైతులు నాలుగు వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటసాగు చేశారు. ఈ మొక్కజొన్న పంటకు కోతులు, అడవి పందుల బాధ ఎక్కువగా ఉంది. అవి గుంపులుగా వచ్చి పంటలోకి ప్రవేశించి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. ప్రస్తుతం మొకజొన్న కంకి దశకు చేరుకోగా కోతులు, అడవిపందులు దాడిచేసి పంటను నాశనం చేస్తున్నాయి. ఈ క్రమంలో ఎలాగైనా పంటలను రక్షించుకోవాలని భావించిన రైతులు వాటి భారినుంచి పంటలను రక్షించుకునేందుకు తంటాలు పడుతున్నారు.


సైదాపూర్ శివారులో మొక్కజొన్న పంట వద్ద ఏర్పాటు చేసిన మైక్

మొక్కజొన్న పంట చుట్టూ సోలార్ కరెంటుతో ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. అడవి జంతువులు వాటికి తాకగానే విద్యుదాఘాతానికి గురై దూరంగా పారిపోతున్నాయి. మరికొందరు రైతులు మొక్కజొన్న చేను వద్ద కుక్క అరుపులతో కూడిన మైక్‌లు ఏర్పాటు చేస్తు న్నారు. ఆ మైక్ రాత్రంతం కుక్క అరుపుతో మోగుతూనే ఉంటుంది. దీంతో అడవిజంతు వులు అటువైపు రావని రైతుల నమ్మకం. ఇంకొం దరు రైతులు మొక్కజొన్న చుట్టు రంగుల జీరో బల్బులు ఏర్పాటు చేస్తున్నారు. ఇలా రైతులు తమ పంటలను రక్షించుకు నేందుకు కష్టాలు పడుతున్నారు.


జాగీర్‌పల్లిలో మొక్కజొన్న చేను వద్ద ఏర్పాటు చేసిన సోలార్ ప్లేట్

మొక్కజొన్నకు సోలార్ కంచె వేశా..

- ఆవుల రవి, మొక్కజొన్న రైతు, జాగీర్‌పల్లి



నేను కౌలుకు తీసుకొని నాలుగు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేస్తున్నాను. కంకి దశకు వచ్చే సరికి కోతులు, అడవిపందులు ప్రవేశించి పంటను నాశనం చేస్తున్నాయి. వాటి రక్షణకు 15 వేలు వెచ్చించి సోలార్ కంచె ఏర్పాటు చేశాను. మొక్కజొన్న పంట చుట్టు జేఏ వైరు కట్టి దానికి సోలార్ కనెక్షన్ ఇస్తున్నాను. సోలార్‌తో ఎలాంటి ప్రాణనష్టం ఉండదు. సోలార్ ఫెన్సింగ్ నాకు చాలా ఉపయోగపడింది.

మైకులతో అడవి పందుల బాధ తగ్గింది

- ఆవుల రాజు, రైతు, జాగీర్‌పల్లి



నేను నాలుగున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశాను. పంటను రక్షించుకునేందుకు పంట చుట్టూ అక్కడక్కడ కుక్క అరుపుతో మైక్‌లను, కలర్ బల్బులను ఏర్పాటు చేశాను. ఇప్పుడు పంటకు కోతులు, అడవిపందుల సమస్య తగ్గింది.

అనుమానాస్పద స్థితిలో గీత కార్మికుడి మృతి



రాజారాం (ఫైల్)

కోనరావుపేట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కోనరావుపేట మండలం నిమ్మపల్లి గ్రామానికి చెందిన దొంతరవేణి రాజారాం(72) అనే గీతకార్మికుడు అనుమానాస్పద స్థితిలో శుక్రవారం రాత్రి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిమ్మపల్లి గ్రామానికి చెందిన గీత కార్మికుడు రాజారాం శుక్రవారం సాయంత్రం కల్లు గీయడానికి బైక్‌పై వెళ్లాడు. రాత్రి వరకు కూడా రాకపోవడంతో కుమారుడు దొంతరవేణి సాయి తన స్నేహితులతో కలిసి వెళ్లి చూడగా గ్రామ శివారులోని మూలవాగు వద్ద ద్విచక్ర వాహనం పెట్టి ఉంది. మరి కొంత దూరంలో మోకు చెట్టుకు తగిలేసి ఉందని, మరికొంత దూరంలో పొలం ఒడ్డుకింద బోర్లాపడి ఉన్నాడని తెలిపారు. రాజారాంను సిరిసిల్ల ప్రభుత్వఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడన్నారు. అనారోగ్యంతో మృతిచెంది ఉంటాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ దాడుల్లో గంజాయి స్వాధీనం



గంజాయితో పట్టుబడిన నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ నాగేశ్వర్‌రావు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లోని జ్యోతినగర్ ప్రాంతంలో శనివారం కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సీఐ కె నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో 183గ్రాముల నిషేధిత గంజాయి పట్టుబడింది. గంజాయిని కలిగి ఉన్న ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేశామని సీఐతెలిపారు. కరీంనగర్‌కు చెందిన డి రేవంత్‌కుమార్(26), నందిమేడారంకుచెందిన అభిరాం(20), నీరుకుల్లకు చెందిన పి నాగరాజు(20)లు పట్టుబడగా రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. నిందితుల వద్ద నుంచి గంజాయితోపాటు 3 సెల్‌ఫోన్‌లు, 2 స్పోర్ట్స్ బైక్‌లను ఎక్సైజ్ పోలీసులు సీజ్ చేశారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్ యాదవ్, ఖాసీంబి, కమలాకర్, కమాలుద్దీన్, సంతోష్‌సాయి పాల్గొన్నారు.

వ్యవసాయ మోటార్ చోరీ

జగిత్యాలరూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల మండలంలోని తిప్పన్నపేట గ్రామ శివారులో గల గచ్చుమాటు వాగు వద్ద గల బోగు సత్తయ్య అనేరైతుకు చెందిన 20వేల రూపాయల విలువైన వ్యవసాయ విద్యుత్ మోటార్‌ను శుక్రవారం రాత్రి గుర్తుతెలియని దొంగలు ఎత్తుకెళ్లినట్లు బాధితుడు సత్తయ్య తెలిపారు. గతంలో పలువురి రైతులకు చెందిన విద్యుత్ మోటార్లు చోరీకి గురైనట్లు రైతులు తెలిపారు. శనివారం జగిత్యాల రూరల్ స్టేషన్‌లో సత్తయ్య ఫిర్యాదు చేశారు.

పీఎంఈజీపీ రుణాల పేరుతో మోసం

- జగిత్యాల జిల్లాలో లక్షల్లో వసూలు
- బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు

జగిత్యాల క్రైం, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రైమ్ మినిస్టర్స్ ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం(పీఎంఈజీపీ) కింద సబ్సిడీ రుణాలు ఇప్పిస్తానని జగిత్యాల జిల్లాలో వేణు వర్మ(35) అనే యువకుడు పలువురి నుంచి లక్షల్లో వసూలు చేశాడు. రుణాలు రాకపోవడంతో ఓ బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు శనివారం వేణు వర్మపై కేసు నమోదు చేశారు. మంచిర్యాల జిల్లా హాజీపూర్‌కు చెందిన వేణు వర్మ జగిత్యాల జిల్లా కేంద్రంలోని తీన్ ఖని చౌరస్తా ప్రాంతంలో తన బంధువుల ఇంట్లో కొన్ని సంవత్సరాలుగా ఉంటున్నాడు. బ్యాంకులో పనిచేస్తున్నానని ప్రధానమంత్రి ఉపాధి కల్పన కార్యక్రమంలో భాగంగా పౌల్ట్రీ ఫామ్‌లు, వస్త్ర వ్యాపారాలు నెలకొల్పేందుకు 35శాతంనుంచి 50శాతం సబ్సిడీతో రుణాలు ఇప్పిస్తానంటూ పలువురిని నమ్మబలికాడు. దీంతో పలువురు నిరుద్యోగులు, వ్యాపారులు పీఎంఈజీపీ పథకంకింద రుణాలు ఇప్పించాలని వేణువర్మతో ఒప్పందం కుదుర్చుకున్నారు. రుణం త్వరితగతిన రావడంకోసం బాధితులు లక్షలాది రూపాయలను, కొందరు బంగారాన్ని వేణువర్మకు అప్పగించారు. రుణాలు వస్తాయనే ఆశతో జగిత్యాల పట్టణంతోపాటు జగిత్యాలరూరల్ మండలంకల్లెడ, మేడిపెల్లి మండలం వల్లంపట్ల గ్రామాలకు చెందిన పలువురు పీఎంఈజీపీ కింద దరఖాస్తు చేసుకున్నారు. మూడేళ్లుగా రుణం రాకపోవడంతో మోసపోయామని గమనించిన బాధితులు శనివారం వేణు వర్మను జగిత్యాలలో పట్టుకుని నిలదీశారు. దాటవేసే ప్రయత్నం చేయడంతో బాధితులు వేణు వర్మను పట్టుకొని పోలీసులకు అప్పగించారు. జగిత్యాల పట్టణంలోని కృష్ణానగర్‌కు చెందిన ఆనందం అనే బాధితుడు లోన్ కోసం వేణు వర్మకు రూ.20 లక్షల నగదు ఇచ్చి మోసపోయానని ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు పేర్కొన్నారు.

కారు బోల్తా.. నలుగురికి గాయాలు

మెట్‌పల్లిటౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి పట్టణంలోని వెంకట్రావ్‌పేట శివారులో కారుబోల్తాపడి నలుగురికి గాయాలయ్యాయి. పట్టణంలోని ఆదర్శనగర్‌కుచెందిన మహేశ్వరి కేబుల్ ఆపరేటర్ లక్ష్మీనర్సయ్య తన కుటుంబ సభ్యులైన శారద, శాంత, వైష్ణవిలతో కలిసి కమ్మర్‌పల్లి గ్రామశివారులోని ఆలయానికి వెళ్లాడు. దర్శనం చేసుకొని మెట్‌పల్లి తిరిగి వస్తుండగా అతివేగంగా వస్తున్న కారు వెంకట్రావ్‌పేట శివారులో అదుపుతప్పి జాతీయ రహదారిపై పల్టీలు కొడుతూ చెట్టును ఢీకొంది. పలువురు వాహనదారులు క్షతగాత్రులను మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శాంత అనే మహిళ పరిస్థితి విషమంగా ఉండటంతో నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి పరిశీలించారు.

పశువుల కాపరి ఆత్మహత్య

మెట్‌పల్లిరూరల్, ఫిబ్రవరి, 8(ఆంధ్రజ్యోతి): మెట్‌పల్లి మండలంలోని రంగరావుపేట గ్రామానికి చెందిన చొప్పరి నడ్పినర్సయ్య(55) అనే పశువుల కాపరి ఇంటి నుంచి వెళ్లిన వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు శనివారం పోలీసులు తెలిపారు. పోలీసులు, గ్రామస్థులు తెలిపినవివరాల ప్రకారం గ్రామానికి చెందిన చొప్పరి నడ్పినర్సయ్య గ్రామంలో పశువుల కాపరిగా పనిచేస్తున్నాడు. కొంతకాలం నుంచి అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మానసికవేదనతో కుంగిపోతున్నాడు. శుక్రవారం ఉదయం పశువులను మేపడానికి ఇంటి నుంచి వెళ్లి సాయంత్రం పశువులను గ్రామంలో వదిలి ఇంటికి వెళ్లలేదు. దీంతో శుక్రవారం రాత్రి నుంచి ఆయన కోసం కుటుంబ సభ్యులు, బంధువులు వెతికిన ఫలితం లభించలేదు. శనివారం సాయంత్రం దేవతల కుంట సమీపంలో చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని కనిపించడంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య చొప్పరి నడ్పిలక్ష్మీ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని చల్లూరులో మానేరు వాగునుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకరవాణా చేస్తున్న ట్రాక్టర్ ను పట్టుకొని పోలీసు స్టేషన్ తరలించినట్టు ఎస్ఐ తోట తిరుపతి తెలిపారు. చల్లూరు గ్రామనికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్, ఓనర్ మామిడి మొండయ్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

సేవాభావం.. దేశభక్తి

- రిపబ్లిక్ డే పరేడ్‌లో ప్రతిభ చాటిన రుచిత
- శాతవాహన యూనివర్సిటీ నుంచి ఏకైక మహిళా వలంటీర్



ఢిల్లీలో ప్రశంసాపత్రాలు అందుకుంటున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): యువతలో క్రమశిక్షణ, సేవాభవం, సత్ప్రవర్తన, దేశభక్తిని పెంపొందించేందుకు ఏర్పడింది జాతీయ సేవాదళం (ఎన్ఎస్ఎస్). ఈ ఎన్ ఎస్ఎస్‌లో పాల్గొంటూ దేశభక్తిని, సేవాభావాన్ని, సమాజహిత కార్యక్రమాలను చేపడుతూ రిపబ్లిక్‌డే పరేడ్ పరేడ్‌కు ఎంపికయ్యింది కరీం నగర్ ఎస్సారార్ కళాశాల విద్యార్థిని గుగులోతు రుచిత. మంచిర్యాల జిల్లా సర్వాయిపేట గ్రామానికి చెందిన దేశ్యానాయక్, లలిత కుమార్తె రుచిత. మంచిర్యాల జిల్లా కోటపల్లి మోడల్ స్కూల్‌లో ఇంటర్ వరకు చదివింది. పై చదువుల కోసం కరీంనగర్‌లోని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాలలో చేరింది. ఆమె మొదటి నుంచి సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనేది. ఫలితంగా కళాశాలలో నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా చేరింది. కరీంనగర్‌లో జరిగిన ప్రత్యేక శిక్షణ శిబిరాల్లో పాల్గొని సేవా కార్యక్రమాలతోపాటు ఎయిడ్స్ నిర్మూలన, వయోజన విద్య, పచ్చదనం పరిశుభ్రత, అంటువ్యాధుల నిర్మూలన, మత్తు పదార్థాల నిషేధం, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నది. హిమాచల్ ప్రదేశ్‌లో జరిగినజాతీయ సాహస శిక్షణ శిబిరంలో పాల్గొని పలువురి ప్రశంసలను అందుకుంది.

● ప్రత్యేక శిబిరాలు.. శిక్షణ

ఫలితంగా మహారాష్ట్రలోని జల్‌గావ్ యూనివర్సిటీలో జరిగిన ప్రీ రిపబ్లిక్ డే శిక్షణ శిబిరంలో పాల్గొంది. ఈ శిబిరంలో దేశంలోని 29 రాష్ట్రాల నుంచి 400 మంది వలంటీర్లు పాల్గొనగా రిపబ్లిక్‌డే పరేడ్‌కు 200 మందిని ఎంపిక చేశారు. రిపబ్లిక్ డే పరేడ్‌కు శాతవాహన యూనివర్సిటీ నుంచి రుచిత ఎంపికయ్యింది. యూనివర్సిటీ నుంచి ఎంపికైన ఏకైక మహిళా వలంటీర్ ఆమె. అనంతరం ఢిల్లీలో గత సంవత్సరం డిసెంబరు 31 జరిగిన ప్రత్యేక శిక్షణలో రుచిత పాల్గొన్నది. ఈ సంవత్సరం జనవరి 26న ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే పరేడ్‌లో అఖిల భారత యూనివర్సిటీల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల గ్రూపునకు ఆమె ప్రాతినిధ్యం వహించింది. ఈ రిపబ్లిక్ డే పరేడ్‌లో 29 రాష్ట్రాల నుంచి మొత్తం 148 మంది వలంటీర్లు పాల్గొనగా, 52 మంది వలంటీర్లు సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

● రాష్ట్రస్థాయి క్రీడాకారిణిగా..

జాతీయస్థాయి సేవా పథకంలో రిపబ్లిక్‌డే పాల్గొన్న రుచిత రాష్ట్రస్థాయి క్రీడల్లోనూ తన ప్రతిభను చాటింది. పాఠశాల, కళాశాల స్థాయిలో అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో వాలీబాల్, కబడ్డీ క్రీడాంశాల్లో రాష్ట్రస్థాయి క్రీడాకారిణిగా ఎదిగింది రుచిత. వాలీబాల్ క్రీడాంశంలో ఖమ్మం, నల్గొండ, ఆదిలాబాద్ జిల్లాల్లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆమె పాల్గొని ప్రతిభచాటింది. ఆదిలాబాద్ జిల్లా గుడిహత్‌నూర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో ఆమె పాల్గొని తన సత్తాను చాటింది.

అన్నయ్య స్ఫూర్తి, ప్రోత్సాహంతోనే...
- జి రుచిత, ఎన్ఎస్ఎస్ వలంటీర్

క్రీడాకారిణిగా, ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా రాణిస్తున్నానంటే అందుకు మా అన్న సమ్మయ్య నాయక్ ప్రోత్సాహమే కారణం. నన్ను క్రీడల్లో ప్రోత్సహిస్తూ ఎన్ఎస్ఎస్‌లో పలు శిక్షణ శిబిరాల్లో పాల్గొనడానికి తన తోడ్పాటును అందించాడు. ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ కల్వకుంట్ల రామకృష్ణ, ఎన్ఎస్ఎస్ పీవో ఎలిజబెత్‌రాణి తోడ్పాటు అందించారు. ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా జాతీయస్థాయిలో రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొనడం ఆనందంగా ఉంది.

● పలువురి ప్రశంసలు...

భారతదేశం మొత్తం నుంచి రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొన్న 200 మంది వలంటీర్లు ప్రశంసలు అందుకున్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్‌కడ్‌తో కలిసి తేనేటి విందులో పాల్గొనే అవకాశం రుచితకు దక్కింది. అనంతరం ఈ వలంటీర్ల బృందాన్నిభారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రత్యేకంగా ఆహ్వానించి తేనేటి విందు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన వారితో ముచ్చటించారు. ఈ నెల 2న రాష్ట్రానికి వచ్చిన రుచిత ఇతర సభ్యులు రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మను ఆయన కలిశారు.



రుచితను సన్మానిస్తున్న ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ కె రామకృష్ణ, అధ్యాపకులు(ఫైల్)

ఆర్‌డీ పరేడ్ జీవితంలో ఒక మైలురాయి



- కల్వకుంట్ల రామకృష్ణ, ఎస్సారార్ ప్రిన్సిపాల్

జాతీయస్థాయిలో ఎన్ఎస్ఎస్ వంటీర్‌గా రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొనడం రుచితకు జీవితంలో ఒక మైలురాయిగా నిలుస్తుంది. రాష్ట్రపతి, ఉప రాష్ట్రపతి, ప్రధానమంత్రితో కలవడం ఆమెకు మర్చిపోలేని అనుభూతి. రుచిత ఎస్సారార్ కళాశాలకే ఆదర్శంగా నిలిచింది.

కళాశాల ఘనతను పెంచింది..



- ఎలిజబెత్‌రాణి, ఎన్ఎస్ఎస్ పీవో

గుగులోతు రుచిత జాతీయస్థాయి రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొనడం శాతవాహన యూనివర్సిటీకే ఆదర్శం. ఆమె క్రమశిక్షణ, అంకిత భావం, పట్టుదలే ఆమెను రిపబ్లిక్‌డే పరేడ్‌కు ఎంపిక చేశాయి. క్రీడాకారిణిగా, ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా రుచిత ఎస్సారార్ కళాశాల ఘనతను పెంచింది.

నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

చొప్పదండి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నవోదయ విద్యాలయంలో 9, 11వ తరగతిలో ఖాళీగాఉన్న సీట్లకు శనివారం నిర్వహించిన ప్రవేశపరీక్ష ప్రశాంతంగా జరిగింది. 9వ తరగతిలో ప్రవేశానికి ఉమ్మడిజిల్లా నుంచి 1340 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 802మంది పరీక్షకు హాజరయ్యారు. 11వతరగతిలో ప్రవేశానికి 1278 మంది దరఖాస్తు చేసుకోగా 1021 మంది విద్యార్థులు హాజరయ్యారు.

చొప్పదండిలో చోరీ

చొప్పదండి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విజయనగరం కాలనీలో తాళంవేసి ఉన్న ఇంటిలో దొంగతనం జరిగింది. ఎస్ఐ అనూష కథనం మేరకు.. సామల తిరుపతి ఈనెల3న హుస్నాబాద్‌లో తన అత్తమ్మ ఇంటికి వెళ్లి తిరిగి 7న ఇంటికి వచ్చాడు. ఇంటి తలుపుల తాళం పగలగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా హాలులో, బెడ్‌రూంలో సామాన్లు చిందరవందరగా పడి ఉన్నాయి. బెడ్ రూంలో ఉన్నా బీరువాలో గల బంగారం బ్రాస్లెట్, ఉంగరం, రెండు జతల వెండి పట్ట గొలుసులు, నగదు కలిపి మొత్తం రూ.96వేల విలువగల సొత్తును దొంగిలించుకుపోయారు. సామల తిరుపతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనూష తెలిపారు.

ఆరో తరగతి విద్యార్థినితో ఉపాధ్యాయుడి అసభ్య ప్రవర్తన

- పోక్సో, అట్రాసిటీ కేసు నమోదు

జగిత్యాలరూరల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తిస్తున్న జగిత్యాల రూరల్ మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాల ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు, అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఆరో తరగతి చదువుచున్న విద్యార్థినిని గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పేరుతో ఉపాధ్యాయుడు కొన్ని రోజులుగా అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. దీంతో బాలిక విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పింది. శనివారం బాలిక తల్లితండ్రులు జగిత్యాల రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రైవేట్ ఉపాధ్యాయుడిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రతిష్టాత్మకంగా ఎమ్మెల్సీ ఎన్నికలు

- కాంగ్రెస్, బీజేపీ పోటాపోటీ ప్రయత్నాలు ● ఆసక్తి చూపని బీఆర్ఎస్
- రేపటితో ముగియనున్న నామినేషన్లు

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, కరీంనగర్)

పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలపై కాంగ్రెస్, బీజేపీ ప్రత్యేక దృష్టిసారిస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ పోటీ నుంచి తప్పుకోవడానికే సిద్ధమైనట్లు తెలుస్తున్నది. నామినేషన్లకు ముందు నుంచే కాంగ్రెస్, బీజేపీ క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్‌ను ఎన్నికలకు సమాయత్తం చేస్తూ బాధ్యతలు అప్పగిస్తున్నాయి. బీఆర్ఎస్ మాత్రం అభ్యర్థి ఎవరన్నది ప్రకటించడానికి కూడా ఆసక్తి చూపించకపోవడంతో ఆ పార్టీ పోటీలో ఉండకూడదని నిర్ణయించుకున్నట్లేనని రాజకీయవర్గాలు భావిస్తున్నాయి.

● భారీగా నామినేషన్లు..

కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గంలో ఈనెల10తో నామినేషన్ల గడువు ముగియనున్నది. ఇప్పటికే కాంగ్రెస్, బీజేపీ బలపరిచిన అభ్యర్థులతోపాటు 49మంది నామినేషన్లు వేశారు. ఉపాధ్యాయ స్థానానికి బీజేపీ అభ్యర్థితోపాటు పీఆర్‌టీయూటీఎస్, టీపీటీఎఫ్ అభ్యర్థులు, సిట్టింగ్ ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, మరో ఐదుగురు నామినేషన్లు వేశారు. ఆదివారం సెలవుదినం కాగా సోమవారం ఒక్కరోజు మాత్రమే అవకాశమున్నది. పట్టభద్రుల స్థానంలో ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీకి చెందిన టి జీవన్‌రెడ్డి ఎమ్మెల్సీగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. తమ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకోవాలని ఆపార్టీ సీరియస్‌గా ప్రయత్నిస్తున్నది. అభ్యర్థి ఎంపిక విషయంలో ఆచితూచి వ్యవహరించి చివరకు ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్‌రెడ్డిని రంగంలోకి దించింది. ఇదే స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిత్వం కోసం చివరి వరకు ప్రయత్నిస్తూ వచ్చిన అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్న హరికృష్ణ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బక్క జడ్సన్, ఆదిలాబాద్ జిల్లా మహిళాకాంగ్రెస్ అధ్యక్షురాలు మంచికట్ల ఆశమ్మ రెబల్స్‌గా నామినేషన్లు వేశారు. బీజేపీ అభ్యర్థిగా సంగారెడ్డి జిల్లా బీజేపీ అధ్యక్షురాలు గోదావరి భర్త డాక్టర్ సి అంజిరెడ్డి నామినేషన్ వేశారు. ఆయన ఒక్కరే ఆపార్టీ నుంచి అభ్యర్థిగా బరిలో ఉన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేయడానికి ఆసక్తి చూపిస్తూ ఆ పార్టీకి చెందిన కరీంనగర్ మాజీ మేయర్, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీచైర్మన్ సర్దార్ రవీందర్‌సింగ్ నామినేషన్ వేశారు. పార్టీనుంచి అభ్యర్థిని నిలుపుతున్న సంకేతాలు ఏమీ రాక పోవడంతో ఆయన ఇండిపెండెంట్‌గా బరిలో ఉండే అవకాశాలున్నాయి. ట్రస్మా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు యాదగిరి శేఖర్‌రావు, డీఎస్పీ ఉద్యోగానికి రాజీనామాచేసిన మదనం గంగాధర్‌తో పాటు 49మంది ఈ స్థానానికి నామినేషన్ వేశారు.

● ఉమ్మడి జిల్లాలోనే 50 శాతం ఓటర్లు

నియోజకవర్గంలో 3.5లక్షల ఓట్లుఉండగా ఉమ్మడిజిల్లా పరిధిలోనే 50శాతం ఓటర్లు ఉన్నారు. దీంతో అందరూ జిల్లాపై దృష్టి కేంద్రీకరించారు. కాంగ్రెస్‌పార్టీ నరేందర్‌రెడ్డిని బరిలో నిలపడానికి ఇదే ప్రధానకారణంగా భావిస్తున్నారు. ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్సీ టి జీవన్‌రెడ్డి కూడా జిల్లాకు చెందిన వారే అయినందున గతంలో గెలుపు సాధ్యమైందని ఆ పార్టీ అంచనా వేసింది. బీజేపీ అభ్యర్థి డాక్టర్ సి అంజిరెడ్డి గెలుపు బాధ్యతను కరీంనగర్ ఎంపీ, కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ స్వీకరించి పార్టీలోని అన్ని విభాగాలను, పార్టీ అభిమానులు, ఆర్ఎస్ఎస్ తదితర అనుబంధ సంస్థలను రంగంలోకి దించి క్షేత్రస్థాయిలో ఇప్పటికే బాధ్యతలు అప్పగించారని ప్రచారం జరుగుతున్నది. శనివారం పట్టభద్రుల సంకల్ప యాత్ర పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో బండి సంజయ్‌కుమార్‌తోపాటు ఎంపీలు రఘునందన్‌రావు, నగేశ్, ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, వెంకట్‌రమణారెడ్డి, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా, రామారావు పటేల్, పాల్వాయి హరీష్‌బాబు తదితరులు పాల్గొని పాల్గొని పార్టీ కేడర్‌లో జోష్ నింపారు. అధికార కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వి నరేందర్‌రెడ్డి నామినేషన్ల చివరి రోజున భారీ ర్యాలీ నిర్వహించనున్నారు.

● ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానంలో..

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి తొమ్మిది మంది నామినేషన్లు వేయగా సిట్టింగ్‌ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య, పీఆర్‌టీయూటీఎస్ అభ్యర్థిగా వంగ మహేందర్‌రెడ్డి, టీపీటీఎఫ్ అభ్యర్థి వై అశోక్‌కుమార్ ప్రధాన పోటీదారులుగా ఉంటారని ఉపాధ్యాయవర్గాల్లో చర్చించుకుంటున్నారు. బీజేపీ అభ్యర్థి మల్క కొమురయ్య పల్లవి గ్రూప్‌సంస్థల చైర్మన్, హైదరాబాద్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేతగా ఉన్నారు. ఆర్ఎస్ఎస్‌తో మొదటినుంచి సంబంధాలున్న కొమురయ్య గెలుపును బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నదని చెబుతున్నారు. కాంగ్రెస్ ఇప్పటివరకు టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎవరికి సహకారం అందించేది ప్రకటించలేదు. 26వేల పై చిలుకు ఓట్లు మాత్రమే ఉండడంతో అభ్యర్థులు ఓటర్లను నేరుగా కలిసే ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ వాతావరణం పెరిగింది. కాంగ్రెస్, బీజేపీ తమ అభ్యర్థులను గెలిపించుకోవడం సవాల్‌గా తీసుకోవడంతో ఎన్నికలు ఆసక్తికరంగా మారనున్నాయి.

ముందు చూపు లేకనే యూరియా కొరత

- రైతులకు ఆపన్నహస్తంగా ఆర్ఎఫ్‌సీఎల్
- యుద్ధ ప్రాతిపదికన వారం రోజుల్లో 12వేల టన్నుల సరఫరా
- పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలో 1.32లక్షల బస్తాలు
- ప్రాథమిక సహకార సంఘాలకు చేరుతున్న యూరియా
- ఎకరానికి ఒక బస్తా చొప్పున రైతులకు ఇచ్చేందుకు నిర్ణయం



ఆర్ఎఫ్‌సీఎల్‌లో యూరియా బ్యాగింగ్ చేస్తున్న సిబ్బంది



పాలకుర్తి వ్యవసాయ సహకార సంఘానికి చేరిన ఆర్ఎఫ్‌సీఎల్ యూరియా

కోల్‌సిటీ, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణ జిల్లాల్లో యాసంగిలో సాగు విస్తీర్ణం పెరిగింది. వరి, మొక్కజొన్న సాగు పెరగడంతో యూరియా అవసరం ఏర్పడింది. అవసరాలకు తగ్గట్టుగా వ్యవసాయ శాఖ ముందుచూపు కనబర్చకపోవడంతో యూరియా కొరత ఏర్పడింది. వర్షాకాలం, యాసంగిలకు మధ్య సాగు విస్తీర్ణం బట్టి ప్రణాళిక సిద్ధం చేసుకోకపోవడం, యాసంగిలో సాగులేని జిల్లాల్లో స్టాక్ ఎక్కువగా పెట్టడంతో పంటల విస్తీర్ణం ఉన్న జిల్లాలకు కొరత ఏర్పడింది. రామగుండంలో యేటా12లక్షల టన్నుల యూరియా ఉత్పత్తిచేసే ఆర్ఎఫ్‌సీఎల్ ఉన్నా యూరియాను ప్రణాళికబద్ధంగా వ్యవసాయశాఖ వినియోగించు కోవడం లేదు. దీంతో యూరియా కొరత ఏర్పడి రైతాంగం యూరియా బస్తాల కోసం బారులు తీరాల్సిన పరిస్థితి ఏర్పడింది.

సమన్వయ లోపంతోనే రైతాంగానికి ఇక్కట్లు...

వ్యవసాయశాఖ సమన్వయ లోపంతోనే రైతాంగానికి ఇబ్బందులు ఎదురవుతున్నట్టు భావిస్తున్నారు. సాధారణంగా వ్యవసాయశాఖ పంటల సాగు విస్తీర్ణాన్ని అంచనా వేసుకుని ఎరువులను ముందస్తుగా తమ గోడౌన్‌లలో నిల్వ చేస్తుంది. రైతాంగానికి యూరియాను సమయానికి సరఫరా చేస్తారు. ప్రస్తుతం రాష్ట్రంలోని నిర్మల్, నారాయణపేట్, గద్వాల్ జిల్లాల్లో యూరియా నిల్వలు ఎక్కువగా ఉన్నట్టు వ్యవసాయ శాఖ రికార్డులు చెబుతున్నాయి. ఎస్ఆర్ఎస్పీ, ఎల్ఎండీ, మిడ్ మానేర్‌లో నీటి నిల్వలు ఉండడంతో వరి, మొక్కజొన్న విస్తీర్ణం పెరిగింది. దీంతో జగిత్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో యూరియా డిమాండ్ ఎక్కువగాఉంది. వరికి యూరియా వేసే సీజన్‌కావడం, గోడౌన్లు ఖాళీ కావడంతో యూరియా కోసం రైతులు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, డీలర్లవద్ద క్యూ కడుతున్నారు.

కష్టకాలంలో ఆదుకుంటున్న ఆర్ఎఫ్‌సీఎల్

రామగుండంలో నెలకొల్పిన ఆర్ఎఫ్‌సీఎల్ పరిశ్రమ కష్టకాలంలో రైతాంగానికి దన్నుగా ఉంటుంది. ఆర్ఎఫ్‌సీఎల్ ఉత్పత్తిలో 40నుంచి 45శాతం యూరియాను రాష్ట్రానికే కేటాయిస్తుంది. 15రోజులుగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో యూరియా కొరత ఏర్పడ డంతో ఆయా జిల్లాల కలెక్టర్ల విజ్ఞప్తి మేరకు యుద్ధ ప్రాతిపదికన యూరియా సరఫరా చేస్తున్నారు. కరీంనగర్, పెద్దపల్లి, మంచి ర్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు 15వేల టన్నులు సరఫరా చేసింది. ఒక పెద్దపల్లి జిల్లాకే 66వేల బస్తాల యూరియాను సరఫరా చేసింది. వారంరోజుల్లో 3రేకులను కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆదిలాబాద్ జిల్లాలకు పంపారు. పెద్దపల్లి, జగిత్యాల, కరీంనగర్ జిల్లాల్లో యూరియా కొరత ఎక్కువగా ఏర్పడంతో మంచిర్యాలకు పంపిన కోటా నుంచి కూడా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు మళ్లిస్తున్నారు.

ఎకరానికి ఒకబస్తా ఇచ్చేందుకు ప్రణాళికలు


కలెక్టర్ల విజ్ఞప్తితో ఆర్ఎఫ్‌సీఎల్ కేటాయించిన కోటాను మించి అత్యవసరంగా 1.32లక్షల బస్తాల యూరియాను పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల జిల్లాలకు పంపింది. ఆర్ఎఫ్‌సీఎల్ నుంచి పెద్దపల్లి, కరీంనగర్, మంచిర్యాల రైల్వే స్టేషన్లకు వ్యాగన్ల ద్వారా యూరియా సరఫరా కాగా అక్కడి నుంచి లారీల ద్వారా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు, డీలర్లకు చేరుతుంది. ప్రస్తుత కొరతను అధిగమించేందుకు ఎకరానికి ఒకబస్తా చొప్పున ఇచ్చేందుకు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ప్రణాళికలు వేసుకున్నట్టు తెలుస్తుంది.

ఆ... 60వేల టన్నులు ఎక్కడ?

ఈ ఆర్థిక సంవత్సరం జనవరి మాసాంతానికి ఆర్ఎఫ్‌సీఎల్‌లో 9.74లక్షల టన్నుల ఉత్పత్తి జరుగగా ఒక్క తెలంగాణకే 3.6లక్షల టన్నులు(37శాతం) సరఫరా చేశారు. సాధారణంగా రైతాంగానికి యూరియా విక్రయించిన వెంటనే పాయింట్ ఆఫ్ సేల్(పీఓఎస్) ద్వారా రైతులు వేలి ముద్రలు వేయాల్సి ఉంటుంది. దీంతో కేంద్రప్రభుత్వ సబ్సిడీ యూరియా పరిశ్రమలకు వస్తుంది. తెలంగాణలో 60వేల టన్నుల యూరియాకు పీఓఎస్ కాలేదు. అంటే రాష్ట్ర ప్రభుత్వ గోడౌన్‌లలో ఆర్ఎఫ్‌సీఎల్ యూరియానే 60వేల టన్నులు ఉన్నట్టు లెక్క. ఇంత యూరియా అందుబాటులో ఉన్నా యూరియా కొరత ఏర్పడడం, రైతాంగం బారులు తీరే పరిస్థితి ఏర్పడంపట్ల పలు అనుమానాలకు తావిస్తుంది. యూరియా గోడౌన్‌లలో ఉందా, లేక మరే దారి మళ్లిందా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

కల్యాణం.. కమనీయం..

నేడు ప్రపంచ వివాహ దినోత్సవం



- మళ్లీ తెరపైకి వస్తున్న పాత కాలపు సాంప్రదాయాలు
- పెళ్లికి వెడ్డింగ్ ప్లానర్స్.. ప్యాకేజీలు
- వివాహాల్లో పెరుగుతున్న ఆర్భాటాలు
- ప్రేమానురాగాలు తగ్గుముఖం... పెరుగుతున్న ఖర్చులు
- ప్రీ వెడ్డింగ్‌కు పెరిగిన ప్రాధాన్యం

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

పెళ్లి.. అదొక పవిత్ర బంధం. జీవితాంతం భార్యభర్తలిద్దరు ఒకరి కోసం ఒకరుగా జీవించే అనురాగ బంధం. ఆ బంధం చిరకాలం ఆనందమయంగా సాగిపోవడం కోసం.. కొత్త దంపతుల మధ్య చక్కటి అవగాహన కోసం బంధువుల కోలాహలం మధ్య ఐదు రోజుల పెళ్లి జరిగేది. మారుతున్న కాలం.. యాంత్రిక జీవితంలో ఆ పెళ్లిళ్లు మూడు రోజులకు మారిపోయాయి. ఆ తరువాత ఒకచోట పెళ్లి జరిగితే మరోచోట మారుపెళ్లి పేరుతో విందు భోజనం జరుగుతుండేది. ఇప్పుడు అక్కడక్కడా రెండు రోజుల పెళ్లిళ్లు కనిపిస్తున్నా ఎక్కువ శాతం అరరోజు పెళ్లికే పరిమితం అవుతున్నాయి. ఆకాశమంత పందిరి.. భూదేవంత పీటలు వేసి అంగరంగ వైభవంగా ఖర్చులకు వెనుకాడకుండా పెళ్లిళ్లు కల్యాణ వైభోగంగానే జరిపిస్తున్నారు. ఇప్పుడు ఒక పెళ్లి ఖర్చు రూ.30లక్షల నుంచి రూ.50లక్షల వరకు కూడా అవుతుంది. పెళ్లి పనులు చేసి పెట్టేందుకు మనుషులు రెడిమేడ్‌గా లభిస్తున్నారు. చివరకు పెళ్లి కూతురు బంధువులు పట్టుకురావాల్సిన పెళ్లి వస్తువులు కూడా రెడిమేడ్‌గా వచ్చే అమ్మాయిలే రకరకాల వస్త్రాలు ధరించి మోసుకెళ్లడం జరుగుతుంది. పాత కాలంలో పెళ్లి కూతురును పల్లకిలో, పెళ్లి కొడుకును గుర్రం పైన ఊరేగించే వారు. మధ్య కాలంలో అవి అంతరించి పోయాయి. ప్రస్తుతం పెళ్లిల్లో ప్రత్యేకతగా ఉండడం కోసం మళ్లీ పల్లకిల్లో పెళ్లి కూతురును, గుర్రం బగ్గిల్లో పెళ్లి కొడుకు, పాత కాలపు జీప్, కార్లను మళ్లీ ఉపయోగంలోకి తీసుకువస్తున్నారు. మరికొందరు తెలుగు సాంప్రదాయానికి భిన్నంగా ఉండడం కోసం కేరళ, గుజరాతీ పద్ధతులను కూడా ఉపయోగిస్తున్నారు. కేరళ వాయిద్యం, అక్కడి నృత్యాలు, మార్వాడి వేషధారణలతో ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

● ప్రీ వెడ్డింగ్‌కు పరుగులు..



పెళ్లిలో ప్రధానంగా ప్రీవెడ్డింగ్ షూట్‌కు ప్రాధాన్యం పెరిగింది. ఇందుకోసం జిల్లాలో ఎన్ని ప్రాంతాలు ఉన్నా కొందరు కేరళ, ఆంధ్రా, గోవా, మహారాష్ట్ర ప్రాంతాలకు వెళితే, మరికొందరు ఏకంగా ఇతర దేశాలకు కూడా వెళుతున్నారు. ప్రీ వెడ్డింగ్ కోసం రూ 3 లక్షల నుంచి 5 లక్షల వరకు ఖర్చు చేస్తున్న వారు ఉన్నారు. సినిమా తరహాలో వీడియో ఆల్బమ్స్ రూపొందిస్తున్నారు. మనకే ప్రత్యేకమైన జ్ఞాపకాలను సైతం యూట్యూబ్‌ల్లో ప్రీ వెడ్డింగ్ పేరిట అప్‌లోడ్ చేయడం కనిపిస్తోంది.

● ప్రతీ పనికి... ప్యాకేజీ

పెళ్లి అనగానే ఆ పనులను చూసి గాబరా పడుతుంటారు. పెళ్లి ముహూర్తం దగ్గర పడుతుంటే హడావుడి పెరుగుతుంది. కానీ ఇప్పుడు ఎంత హంగామాతో జరపడానికైనా మ్యారేజ్ పానర్స్ మన ముందుకు వస్తున్నారు. వివిధ రకాల ప్యాకేజీలను అందిస్తున్నారు. పెళ్లి కావాల్సిన ఏర్పాట్లన్నీ చేసిపెడితే సర్వీస్ చార్జీ చెల్లిస్తే సరిపోతుంది. పెళ్లి వేడుకను నిర్వహించడానికి వచ్చిన సంస్థలు ఇప్పుడు కోట్లలోనే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. పెళ్లి పందిరి నుంచి పెళ్లి భోజనాలు, ఫుడ్ స్టాల్స్, వెడ్డింగ్ కార్డ్స్ పెళ్లి ఫొటోలు, ఊరేగింపుతో పాటు పెళ్లికి కావాల్సిన బట్టలు డిజైన్ చేస్తుంటారు. అబ్బాయి, అమ్మాయిలకు వేసుకోవాల్సిన నగలు, రింగ్స్, చేతికి పెట్టుకునే మెహంది, చివరకు చెప్పులను కూడా వారే ఎంపిక చేస్తున్నారు. మ్యారేజ్ ప్లానర్స్ వివిధ రకాల కళాకారులను కూడా పెళ్లిలో ఉపయోగిస్తారు. గతంలో పెళ్లిళ్లను కల్యాణ మండపాల్లోనే నిర్వహించే వారు. ఆ పరిస్థితి కూడా మారిపోయింది. మైదాన ప్రాంతంలో రకరకాల సెట్టింగ్‌లను వేస్తున్నారు. పెళ్లిల్లో మహిళలు పాటలు పాడడం, డ్యాన్సులు చేయడం వంటివి నిర్వహిస్తున్నారు. వీరు మ్యారేజ్‌కు వచ్చే ఒకవ్యక్తిపై వెయ్యి రూపాయల వరకు చార్జీ చేస్తారు. ఎంత వైభవంగా పెళ్లి జరిపించాలన్నా వీరు సిద్ధమే. భోజనాల విషయానికి వస్తే బాస్మతి బియ్యంతో బిర్యానీ, మటన్, చికెన్, స్వీట్‌తోపాటు వివిధ ఆహార పదార్థాలతో ప్లేట్ పూర్తిగా నిండిపోతుంది. కూరగాయలతోనే వివిధ రకాల బొమ్మలు చేయడం, భోజనం ముగిసిన తరువాత రకరకాల సూప్‌లు, రకరకాల చిరుతిళ్ల స్టాల్స్‌ను కూడా ఏర్పాటు చేస్తున్నారు.

● ప్రపంచ వివాహ దినోత్సవం నేపథ్యం ఇదీ..

భార్యభర్తల అనుబంధాన్ని గుర్తించి 1981లో అమెరికాలోని కొందరు దంపతులు వాలెంటైన్ డేను మ్యారెజ్‌డేగా ప్రకటించాలని మేయర్‌ను, బిషప్‌ను కోరారు. 1982లో అమెరికాలోని 43మంది గవర్నర్లు దీనిపై చర్చించి మ్యారెజ్ డేను ప్రకటించారు. ఫిబ్రవరిలోని 2వ ఆదివారం ఈ దినోత్సవాన్ని జరుపుకోవాలని, ఇందుకోసం 1983లో సింబల్‌ను కూడా రూపొందించారు. వెలుగుతున్న రెండు కొవ్వొత్తుల బొమ్మ ఈ దినోత్సవ సంకేతంగా సూచించారు.

● దూరమవుతున్న బంధుత్వాలు

పెళ్లి స్టేటస్ సింబల్‌గా మారిపోయిన క్రమంలోనే బంధుత్వాలు కూడా దూరమైపో తున్నాయి. సమయానికి పెళ్లి వేడుకకు వచ్చి వెళ్లిపో తున్న బంధుత్వాలే కనిపిస్తున్నాయి. అక్కచెల్లెళ్ల అప్యాయతలు, అన్నదమ్ముల ఆనందాలు, బావమరదళ్ల చిలిపి మాటలు, వదినమరదళ్ల సరదాలు, మామా, తాత, బావ, మనవడు.. ఇలాంటి పిలుపులే ఇప్పుడు పెళ్లిల్లో వినిపించకుండా పోతున్నాయి. లక్షలు ఖర్చు చేసి ఆర్భాటాలు చేస్తున్నా ఆప్యాయ తలను మాత్రం హృద యాల్లో నిలుపుకోలేకపోతున్నారు.

ఎస్‌ఆర్‌ఆర్ కళాశాలలో ఆధునిక కోర్సులు

● ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో అనేక ఆధునిక కోర్సులు అందుబాటులో ఉన్నాయని ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె రామకృష్ణ పేర్కొన్నారు. రానున్న విద్యాసంవత్సరం 2025-26 అడ్మిషన్ల కోసం ప్రిన్సిపాల్ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందంతో శనివారం ప్రవేశాల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.రామకృష్ణ మాట్లాడుతూ ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రస్తుత సంవత్సర అడ్మిషన్లలో రాష్ట్రస్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. రాబోవు సంవత్సరంలో కూడా ఇదేవిధంగా అడ్మిషన్లు రావడానికి అధ్యాపకులు కృషిచేయాలన్నారు. దాదాపుగా చుట్టుపక్కల ప్రాంతాల్లో గల 40 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ కళాశాలలను అధ్యాపకులు బృందాలుగా ఏర్పడి సందర్శించి ప్రవేశాల కోసం ప్రచారం చేస్తారని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలను అధ్యాపకులు సందర్శించి ఎస్ఆర్ఆర్ కళాశాలలో గల సౌకర్యాలను విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించాలని తెలియజేశారు. కళాశాల న్యాక్- ఏ గ్రేడ్ పొంది, స్వయం ప్రతిపత్తి కలిగిన కళాశాల అని అన్నారు. క్లస్టర్ విశ్వవిద్యాలయంగా, పరిశోధన కేంద్రంగా ఉందని అన్నారు. కళాశాలలో ఉత్తమ నైపుణ్యం గల అధ్యాపకులతో అత్యుత్తమ విద్యా బోధన అందించడం జరుగుతుందన్నారు. కళాశాలలో అనేక నూతన కోర్సులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టీజీసిజీటిఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.సురేందర్ రెడ్డి, దోస్త్ కోఆర్డినేటర్ డాక్టర్ ఆర్.రామకృష్ణ, స్టాఫ్ క్లబ్ సెక్రటరీ డాక్టర్ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌లు పి.నితిన్ పాఠక్, టి.రాజయ్య, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక బృందం, అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డి హామీలు ఏమయ్యాయ్

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చేది గాడిద గుడ్డే
- బీసీ జనాభాను తగ్గించడం పెద్ద కుట్ర
- కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పేందుకు బీజేపీకి పట్టం కట్టండి
- కేంద్రహోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



మేనిఫెస్టో బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, ఎంపీ రఘునందన్‌రావు, ఎమ్మెల్యేలు

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): రేవంత్‌రెడ్డి హామీలు ఏమయ్యాయ్.. మోస కారి కాంగ్రెస్‌పార్టీకి ఢిల్లీప్రజలు ఏమి ఇచ్చా రు.. గాడిద గుడ్డును బహుమతిగా ఇచ్చి తగిన బుద్ధిచెప్పారు.. ఇక్కడకూడా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆపార్టీకి వచ్చేది గాడిదగుడ్డే.. అని కేంద్రహోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ అన్నారు. మాటతప్పిన కాంగ్రెస్‌కు పట్టభ ద్రులు, టీచర్లు ఇవ్వాల్సింది కూడా గాడిద గుడ్డేనని బండి సంజయ్ రేవంత్‌రెడ్డి సర్కార్ హామీలను ఎండగట్టారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ శని వారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ జిల్లాశాఖ ఆధ్వర్యంలో నిర్వ హించిన పట్టభద్రుల సంకల్పయాత్రకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగిం చారు. కేసీఆర్ మాదిగానే రేవంత్‌రెడ్డి కూడా ఐరెన్‌లెగ్. ఆయన ఎక్కడ ఏ పార్టీ తరపున ఎన్నికల ప్రచారం చేసినా ఆ పార్టీలు మటాష్ అవుతున్నాయన్నారు. హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ప్రచారం చేస్తే అక్కడకాంగ్రెస్ మటాష్ అయింది. ఇక కేసీఆర్ కూడా అంతేనని సంజయ్ తనదైనశైలిలో కేసీ ఆర్, రేవంత్‌రెడ్డిపై ఫైర్ అయ్యారు. ఏడాదిలో 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని కాంగ్రెస్ మోసం చేసిందని విమర్శించారు. మాట తప్పి న కాంగ్రెస్‌ను ఓడించి బీజేపీని గెలిపించాలని సంజయ్ విజ్ఞప్తి చేశారు. బీసీ జాబితాలో ముస్లింలను చేర్చడం వెనుక పెద్దకుట్ర ఉంద న్నారు. ఒకవైపు కులగణన సర్వేలో బీసీ జనా భాశాతాన్ని తగ్గించి దెబ్బతీస్తున్నారని అన్నా రు. మేధావులు, పట్టభద్రులు ఈ విషయంలో మౌనంగా ఉండడం సమాజానికే అరిష్టమని హెచ్చరించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పాలంటే బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్యను గెలిపించా లని పిలుపునిచ్చారు.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ ఎస్‌కు అభ్యర్థులే లేరు.. ఎందుకో తెలుసా, కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య మ్యాచ్‌ఫిక్సింగ్ జరుగుతోందని, ఆ రెండు పార్టీలు ఒక్కటేనని విమర్శించారు. డ్రగ్స్ కేసులో ఆధారాలున్నా అరెస్టు చేయలేదు.. కాళేశ్వరం స్కాంలో, ఫాంహౌజ్ కేసు ఏమైంది, ఫార్ములా ఈరేసు కేసులు కేటీఆర్‌అరెస్టు తప్పదని చెప్పిన కాం గ్రెస్ నేతలు ఎందుకు ముఖం చాటేశారో తెలుసా అని ప్రశ్నించారు. మెదక్ ఎంపీ బి రఘునందన్‌రావు మాట్లాడుతూ ఢిల్లీలో కేజ్రీ వాల్, ఆయన మంత్రివర్గం అవినీతి, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత లిక్కర్ దందాతోనే కేసీఆర్‌కు తెలంగాణ ప్రజలు చరమగీతం పాడినట్లుగా, ఆమ్ ఆద్మీ పార్టీకి అక్కడి ప్రజలు చరమగీతం పాడి బీజేపీకి పట్టంకట్టారన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు 8వేలమంది ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు పదవీవిరమణ చేస్తే కనీసం వారికి పీఎఫ్, గాట్యూటీ, ఇతర పెన్షన్ బెనిఫిట్స్‌ను రేవంత్‌రెడ్డి సర్కార్ ఇవ్వకుండా 20వేల కోట్లను వెనుకేసుకునేందుకు పదవీ విరమణ వయసును 61నుంచి65కు పెంచా లని ఆలోచిస్తున్నారని విమర్శించారు. ఉద్యోగు లకు అధికారంలోకి వస్తే 5డీఏలు ఇస్తామని ఒక్కటితో రేవంత్‌రెడ్డి సరిపెట్టి, కనీసం పీఆ ర్‌సీ వేయలేదని ఆలోచించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యేలు పాయల శంకర్, కాటిపల్లి వెంకటరమణారెడ్డి, పాల్వాయి హరీష్‌బాబు, రామారావు పటేల్, ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్త, ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ పట్టభద్రుల బీజేపీ అభ్యర్థులు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, ప్రసంగించగా, కరీంనగర్ మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● మార్క్‌ఫెడ్ నుంచి తెలంగాణచౌక్ వరకు భారీ ర్యాలీ..

బీజేపీ తలపెట్టిన పట్టభద్రుల సంకల్ప యాత్ర రాంనగర్‌లోని మార్క్‌ఫెడ్ గ్రౌండ్ వద్ద ప్రారంభం కాగా, రాంనగర్, మంకమ్మతోట, ముకరంపుర మీదుగా తెలంగాణచౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీలో కదం తొక్కిన కార్యకర్తలు

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ



కరీంనగర్ కలెక్టర్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

వేములవాడ రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వేములవాడ శ్రీరాజరాజే శ్వరస్వామి ఆలయంలో శనివారం భక్తు ల రద్దీనెలకొంది. కల్యాణ కట్టలో తలనీ లాలు సమర్పించిన భక్తులు ఆలయ ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అనం తరం స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు.

● స్వామివారి సేవలో కరీంనగర్ కలెక్టర్

శ్రీపార్వతీరాజరాజేశ్వర స్వామివారిని కరీం నగర్ కలెక్టర్ పమేలాసత్పతి శనివారం కుటుంబసమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి కోడె మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం నాగిరెడ్డి మండపంలో కలెక్టర్‌కు అర్చకులు వేదోక్తమంత్ర ఆశీర్వచనం చేసి స్వామివారి ప్రసాదాన్ని అందజేశారు. నమిలికొండ రాజే శ్వర్, ప్రొటోకాల్ ఏఈవో అశోక్, పర్యవేక్షకులు శ్రీకాంత్‌చారి, ఆలయఇన్‌స్పెక్టర్ నూగూరి నరేందర్ ఆలయ సిబ్బంది ఉన్నారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ

● కిటకిటలాడిన ఆలయాలు



ధర్మపురి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం కోసం క్యూలో వేచి ఉన్న భక్తులు

ధర్మపురి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిట లాడాయి. భీష్మ ఏకాదశి పురస్కరించుకుని సుదూర ప్రాంతాల నుంచి క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. పవిత్ర గోదావరి న దిలో భక్తులు స్నానాలు ఆచరించారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కళ్యాణం జరిపించి పూజలు చేశారు. స్వామి వారలకు ఆలయ వేద పండితులు బొజ్జ రమేష్ శర్మ, వేద పారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ తదితర వేద బ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ఉప ప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహిం చారు. కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, సూపరింటెండెంట్ కిరణ్ పాల్గొన్నారు.

ఆర్టిజన్లు ఆందోళన బాట..

- రెగ్యులరైజేషన్ కోసం ఎదురు చూపులు
- ఈ నెల 15వరకు ప్రతి రోజు ఒక్కో ఉమ్మడి జిల్లా కేంద్రంలో ధర్నా
- 20న విద్యుత్ సౌద ముట్టడికి పిలుపు



జగిత్యాలలో ఆందోళన చేస్తున్న ఆర్టిజన్ కార్మికులు

జగిత్యాల, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు రెగ్యులరై జేషన్ కోసం సంవత్సరాల తరబడి ఎదురు చూస్తు న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థలో సుమారు 20,600కు పైగా ఉన్న కాంట్రాక్టు కార్మికులను ఆర్టిజన్ అనే పేరుతో ప్రభుత్వం మోసం చేస్తోందని విమర్శ స్తున్నారు. తక్షణమే ఆర్టిజన్స్ అందరినీ శాశ్వత ఉద్యో గులుగా గుర్తించాలన్న డిమాండ్‌తో కార్మికులు ఆందోళన బాట పట్టారు. రాష్ట్రంలోని విద్యుత్ కార్మిక సంఘాలన్నీ కలిసి విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పడి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారు.

● ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రికల్ బోర్డు ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఉద్యోగులుగా విధులు చేపట్టి ఇప్పుడు ఆర్టిజన్ కార్మికులుగా పిలుస్తున్నప్పటికీ తమకు ఉద్యోగ భద్రత కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రెండు దశాబ్దాలుగా పని చేస్తున్నప్పటికీ ఉద్యోగాలు రెగ్యులర్ కాకపోవడంతో ఆర్టిజన్ కార్మికులు ఎదురుచూపులతో కాలం గడుపుతున్నారు. చాలీచాలని వేతనాలతో మా కుటుంబాలు గడవలేని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారిన తమ బతుకులు మారడం లేదంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏ విధంగానైతే ఏపీఎస్ఈబీ రూల్స్ ఉన్నాయో ఆ రూల్స్ వర్తింపజేసి మిగతా విద్యుత్ ఉద్యోగుల్లాగా తమకు అన్ని వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

● విలీనం చేసినా అందని ప్రయోజనాలు

2017 జూలైలో అప్పటి కేసీఆర్ ప్రభుత్వం విద్యుత్ సంస్థల్లో సబ్‌స్టేషన్లు, ఇతర వాటిల్లో పనిచేస్తున్న ఆపరేటర్లు, ఇతరులు సుమారు 23,667 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆర్టిజన్ పేరుతో విలీనం చేసుకుం టున్నట్లు ఉత్తర్వులు ఇచ్చింది. ఉద్యోగుల విద్యార్హతలను ప్రామాణికంగా తీసుకొని ఉన్నత నైపుణ్యం గల వారికి ఆర్టిజన్ గ్రేడ్-1, నైపుణ్యం గల వారికి గ్రేడ్-2, స్వల్ప నైపుణ్యం గల వారికి ఆర్టిజన్ గ్రేడ్-3, నైపుణ్యం లేని వారికి ఆర్టిజన్ గ్రేడ్-4 హోదా కల్పిస్తూ విలీనం (అబ్జార్షన్) చేసుకుంటూ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఆర్టిజన్ పేరుతో విలీనం చేసినప్పటికీ శాశ్వత ఉద్యోగుల మాదిరిగా వేతనాలు, సెలవులు, బోనస్, పదోన్నతి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందడం లేదని వారు ఆరోపిస్తున్నారు. వారిలో ప్రస్తుతం సుమారు 20,600 మంది ఉన్నారు. కొందరు ఉద్యోగ విరమణ చేయగా, మరికొందరు మృతి చెందారు. విద్యార్హతల మేరకు అందరినీ శాశ్వత ఉద్యోగులుగా జూనియర్ లైన్‌మెన్, జూనియర్ అసిస్టెంట్, సబ్ ఇంజనీర్ తదితర పోస్టులకు ఆర్టిజన్లను కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. పలు సందర్భాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులకు వినతిపత్రాలను సమర్పించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఇటీవల జిల్లా కేంద్రాల్లో ఆర్టిజన్ కార్మికులు మూడు రోజుల పాటు రిలే దీక్షలు చేపట్టారు. ఈ నెల 15వ తేదీ వరకు రాష్ట్రంలోని అన్ని ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో రోజుకు ఒకటి చొప్పున బస్సు యాత్ర పేరిట ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 20వ తేదీ నాటికి సమస్య పరిష్కారం కాకుంటే హైదరాబాద్‌లోని విద్యుత్ సౌద వద్ద భారీ నిరసన కార్యక్రమం నిర్వహించడానికి సమాయత్తం అవుతున్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించకుంటే సమ్మెకు వెళ్లే యోచనలో ఆర్టిజన్ కార్మిక సంఘాలు ఉన్నాయి.

ఆర్టిజన్ పేరుతో తప్పుదోవ పట్టించారు



-దమ్మ రవీందర్‌రెడ్డి, విద్యుత్ ఆర్టిజన్ జేఏసీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ, జగిత్యాల

విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులమైన మ మ్మల్ని ఆర్టిజన్ పేరుతో 2017 సంవత్సరంలో పర్మినెంట్ చేశామని అ ప్పటి ప్రభుత్వం తప్పుదోవ పట్టించింది. ఆ తర్వాత విద్యుత్ సంస్థ యాజమాన్యంపర్మినెంట్ చేయకుండా చాలీచాలని వేతనాలు చెల్లిస్తోంది.

శాశ్వత ఉద్యోగులుగా ప్రకటించాలి



-బొజ్జ తిరుపతి, ఆర్టిజన్ కార్మికుడు, జగిత్యాల

ఆర్టిజన్లను శాశ్వత ఉద్యోగులుగా ప్రకటించాలి. ప్రస్తుతం ఉన్న ఆర్టిజన్‌ల సమస్య పూర్తి అయ్యే వరకు విద్యుత్ శాఖలో ఎలాంటి నోటిఫికేషన్లు ఇవ్వకూడదు. ప్రతి ఆర్టిజన్‌కు ఇంక్రిమెంట్లు, ప్రమోషన్ కూడా ఇవ్వాలి. ఆర్టిజన్ల న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉధృతం చేస్తా

నూతన విద్యా విధానం ఎంతో ఉపయోగకరం

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న బండి సంజయ్

భగత్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం విద్యార్థికి ఎంతో ఉపయోగకరమని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. శనివారం కొత్తపల్లిలోని అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్ వార్షికోత్సవంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నేటి విద్యార్థులను మరో అంబేద్కర్, సర్దార్ పటేల్, ఛత్రపతిలుగా తీర్చిదిద్దేందుకు న్యూ ఎడ్యుకేషన్ పాలసీని తీసుకువచ్చిందన్నారు. అర్బన్ నక్సల్స్ చేతిలో తెలంగాణ విద్యావ్యవస్థ బందీ అయిందని, మోదీ ప్రభుత్వం దేశాన్ని పెన్నులతో సుస్థిరంగా ఉంచుతుంటే తెలంగాణ ప్రభుత్వం గన్నుల రాజ్యం కావాలని చూస్తోందన్నారు. కార్పొరేట్ పాఠశాలలు విద్యను వ్యాపారం చేస్తున్నాయన్నారు. భారత దేశంపై దండయాత్ర చేసి ఇక్కడి ప్రజలపై అత్యాచారాలు చేసిన వాళ్లను గొప్ప వ్యక్తులుగా చూపించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



రోడ్డు భద్రతపై విద్యార్థుల ప్రదర్శన

కరీంనగర్‌క్రైం,ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): జాన్సన్ గ్లోబల్ స్కూల్ విద్యాసంస్థల్లోని కేరా, ఎఎస్‌సి, ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో శనివారం విద్యార్థులకు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణ పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలపై పిల్లలతో ప్రదర్శన ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి పాఠశాలల చైర్మన్ ఊట్కూరు మహిపాల్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులు చేసిన ప్రయత్నం చూపరులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో జాన్సన్ గ్లోబల్ విద్యాసంస్థల చైర్మన్ ఊట్కూరు మహిపాల్ రెడ్డి, డైరెక్టర్లు సింహాచలం హరికృష్ణ, వంగల సంతోష్‌రెడ్డి, రామ్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పారడైజ్‌లో తల్లిదండ్రుల క్రీడా పోటీలు



క్రీడా పోటీల్లో పారడైజ్ పాఠశాల చైర్మన్ డాక్టర్ ఫాతిమారెడ్డి

భగత్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రేకుర్తిలోని పారడైజ్ పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో క్రీడా పోటీలు నిర్వహించారు. కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ డాక్టర్ పి ఫాతిమారెడ్డి, అకాడమిక్ సీఈఓ ఉమాకాంత్, ప్రిన్సిపాల్ టి వసంత, వైస్ ప్రిన్సిపాల్ ఏ మధు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

11న బహిరంగ వేలం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లోని పోలీసు వాహనాలకు వినియోగించి తొలగించిన బ్యాటరీలు, టైర్లు, ఇతర విడిభాగాలు, వినియోగించిన ఆయిల్ వేలం ద్వారా అమ్మకం కోసం ఈ నెల 11న వేలం నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్ పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లోని మోటార్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో వేలం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమాచారం కోసం ఫోన్ 87126 70725లో సంప్రదించాలన్నారు.

తప్పుల తడకగా బీసీ కులగణన

● మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కుటుంబ సర్వే ఒక పూర్తి తప్పుల తడకగా ఉందని, మున్నూరుకాపు జనాబాను తక్కువ చేసి చూపారని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొండ దేవయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ చల్ల హరిశంకర్ అన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం 2014లో నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో తెలంగాణ రాష్ట్రంలో మున్నూరు కాపులు 28లక్షల మంది ఉన్నారని చూపారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో మున్నూరు కాపులు 13లక్షల 60వేల మంది ఉన్నట్లు చూపారని ఆరోపించారు. రాష్ట్ర బీసీ జనాబా 56శాతం ఉంటే అందులో మున్నూరుకాపులు కేవలం 18శాతం ఉన్నారని చూపారని ఆరోపించారు. కాపులు రాజకీయంగా ఎదుగుదలను ఓర్వలేకనే 15లక్షల మందిని తగ్గించి చూపారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ బీసీల పట్ల వివక్ష చూపుతుందని, బీసీల హక్కులు కాలరాయాలనే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. తిరిగి సర్వే చేయించాలని లేని పక్షంలో హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద భారీ ఎత్తున ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి నలువాల రవీందర్, యూత్ ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్, మెతుకు హేమలత తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

ఢిల్లీలో చరిత్రాత్మక విజయం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చరిత్ర తిరగరాసిందని, అక్కడి ఓటర్లు చరిత్రాత్మక తీర్పునిచ్చారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి అన్నారు. శనివారం ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించిన నేపథ్యంలో జిల్లాశాఖ ఆధ్వర్యంలో నగరంలో సంబరాలు నిర్వహించారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా బీజేపీ అధికారంలోకి రావడం తథ్యమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్, కన్నబోయిన ఓదెలు, పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, సాయిని మల్లేశం, దండు కొమురయ్య ఉన్నారు.

● మోదీ విజన్‌కు నిదర్శనం: మాజీ మేయర్ సునీల్‌రావు

దేశంలో బీజేపీకి తిరుగులేదనేందుకు ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలే నిదర్శనమని మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. దేశభవిష్యత్ అంతా బీజేపీదే అనేందుకు ఈఎన్నికల ఫలితాలు ప్రతిపక్ష పార్టీలకు సమాధానం ఇస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురనుందని అన్నారు.

మహిళా కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం



నియామక పత్రాలు అందుకున్న మహిళా కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్ అర్బన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మండల, పట్టణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షులను శనివారం నియమించారు. ఈ మేరకు హైదరాబాద్ గాంధీభవన్‌లో కరీంనగర్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్నరెడ్డి నియామకాలను వెల్లడించారు. హుజూరాబాద్ టౌన్ ఎముల పుష్పలత, జమ్మికుంట టౌన్ పూదరి రేణుక, చొప్పదండి టౌన్ గుంటి స్వరూపలను నియామకం చేశారు. అలాగే చిగురుమామిడి మండల మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా పోలు స్వప్న, హుజురాబాద్‌లో పుల్ల రాధమ్మ, చొప్పదండి చిలుముల స్వప్న, తిమ్మాపూర్ రాచపల్లి సరితలను మండల మహిళ అధ్యక్షురాలుగా, ఎండీ హసీనా, మారుపాక మంజుల, ఎన్నం రజితారెడ్డి, కాల్వ స్వప్నలను జిల్లా మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షులుగా, కవ్వ పద్మ మానకొండూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమించినట్లు తెలిపారు. నియామక పత్రాలను తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు చేతుల మీదుగా అందజేసినట్లు తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ కోసం మంద కృష్ణ అలుపెరుగని పోరాటం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మంద కృష్ణ మాదిగ గత 30 సంవత్సరాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటాలు చేశారని బేడబుడగ జన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిరిపాటి వేణు పేర్కొన్నారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణలో 15 సంచార జాతులను ఒకటిగా చేసి రిజర్వేషన్ కేటాయించిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వం 37 కార్పొరేషన్‌లను ఏర్పాటు చేసి వాటికి చైర్మెన్‌లను నియమించిందన్నారు. 15 ఉపకులాలల్లో బేడబుడగ మేజర్ కులమని, అట్టి కులానికి చెందినవారికి చైర్మెన్ పదవి ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో గౌరవాధ్యక్షుడు తూర్పాటి లింగయ్య, రాష్ట్ర ప్రధానకార్యదర్శి పస్తం ఆంజనేయులు, కోశాధికారి డొక్క రాజేశ్, ప్రచారకార్యదర్శి వానరాశి గిర్ని వెంకటి, చింతల అంజి, పస్తం రమేశ్, పురాణం రమేశ్, ఉపిది రమేశ్, కళ్యం చిన్న గంగారాం, కళ్యం రాజారాం, కళ్యం మహేందర్, మోటం తిరుపతి, కళ్యం శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంబరాన్నంటిన 'అద్వితోత్సవ్-25'

కరీంనగర్ టౌన్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అంబేద్కర్ స్టేడియంలో భగత్‌నగర్ అద్వితా ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహించిన అద్వితోత్సవ్-25 వార్షికోత్సవ సంబరాలు అంబరాన్ని అంటాయి. శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా ప్రొఫెసర్ డి.రామయ్య, ముఖ్యఅతిథులుగా వివేకానంద, అద్విత విద్యాసంస్థల చైర్మన్ కొమురయ్య సౌగాని, అద్విత స్కూల్ డైరెక్టర్ అనుదీప్ సౌగానితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ముందుగా డైరెక్టర్ అనుదీప్ పాఠశాల నివేదికను సమర్పిస్తూ జిల్లాలోనే ప్రథమంగా అంతర్జాతీయ కేంబ్రిడ్జి ఆమోదిత గుర్తింపు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, నైతిక విలువలు, శారీరక శిక్షణ అందిస్తున్నామని అన్నారు. ప్రొఫెసర్ డి.రామయ్య మాట్లాడుతూ దేశాభివృద్ధిలో విద్యార్థులు, యువత ఎంతో కీలకమని అన్నారు. కార్యక్రమంలో చైర్మన్ సౌగాని కొమురయ్య, డాక్టర్ రఘురామన్, డాక్టర్ గండ్ర లక్ష్మణ్‌రావు, గాజుల రవీందర్ మాట్లాడుతూ ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషిని, సహకరిస్తున్న తల్లిదండ్రులను అభినందించారు. ఈకార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ శ్వేతా మాధురి, వివేకానంద విద్యానికేతన్ పాఠశాల ప్రిన్సిపాల్ మిథున్ జే మిస్త్రీ, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



అద్వితలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు

క్రైస్తవులకు అన్యాయం

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కుల గణనలో క్రైస్తవుల పేరు లేకపోవడం వారికి అన్యాయం చేయడమే అని క్రిస్టియన్ హక్కుల రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఇ ఎలీషా ఆరోపించారు. శనివారం నగరంలోని ప్రెస్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో క్రైస్తవులు లేరా? అని ప్రశ్నించారు.

చలో ఢిల్లీ జయప్రదం చేయండి

గణేశ్‌నగర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మార్చి 27న నిర్వహించే చలో ఢిల్లీని జయప్రదం చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ నాయకులు పేర్కొన్నారు. శనివారం చలో ఢిల్లీ పోస్టర్‌ను జాతీయ అధ్యక్షులు సందెపోగు ఉదయ్ కుమార్ ఆవిష్కరించారు. వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య కాషాయీకరణను అడ్డుకుంటామన్నారు. ప్రైవేటు యూనివర్సిటీలకు అనుకూలంగా నిబంధనలు ఏర్పాటు చేయడం సరికాదన్నారు. వైస్ ఛాన్సలర్ నియామకంలో అర్హతలు సవరిస్తూ కొత్త ప్రతిపాదన తెచ్చే అధికారం యూజీసీకి లేదని యూజీసీ తెచ్చినా చట్టరీత్యా చెల్లుబాటు కాదన్నారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తాటికొండ రవి, కార్యదర్శి మాదం తిరుపతి, వెంకటేశ్వర్లు,పెద్దిసూరి, గణేష్, తిరుపతి, రంగస్వామి, శ్వేత ఉన్నారు.

ఆటలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయి

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): ఆటలు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కొత్తపల్లి మండలంలోని చింతకుంట శ్రీ చైతన్య సీబీఎస్ఈ సిఓఐపీఎల్ పాఠశాలలో శనివారం కరీంనగర్, మంచిర్యాల, సిద్దిపేట, నిజామాబాద్ జోనల్ లెవెల్ రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహించారు. కరీంనగర్ సీబీఎస్ఈ సీఈఓ ఐపీఎల్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ ఆచార్య జెండా ఊపి రాష్ట్ర స్థాయి పోటీలను ప్రారంభించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. శ్రీ చైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ సీమా, జీఎం నాగేం, చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీద్య, కరీంనగర్ జోన్ ఏజీఎం ఏం రాజు ఉన్నారు.

సత్యదేవుడి ఆలయ వార్షికోత్సవం

కరీంనగర్ కల్చరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): నగరంలోని రాంనగర్ రమాసత్యనారాయణస్వామి, అభయాంజనేయ స్వామి ఆలయంలో ఆలయ 21వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ గౌరవాధ్యక్షుడు మల్లికార్జున రాజేందర్-రజనీదేవి దంపతుల నేతృత్వంలో ఉదయం అర్చకులు ప్రత్యేక పూజలు, అలంకారాలు చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి టి సంతోష్‌కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ చల్ల పద్మ హరికృష్ణ, మాజీ చైర్మన్ ఏ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● నగరంలోని పలు ఆలయాల్లో శనివారం భక్తిశ్రద్ధలతో భీష్మ ఏకాదశి పూజలు నిర్వహించారు. శైవ, వైష్ణవాలయాల్లో సామూహిక విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణాలు చేశారు. భీష్ముని చరిత్రను విన్నారు.

జ్ఞాన మందిరం వార్షికోత్సవం

జమ్మికుంట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): భగవద్గీత జ్ఞానమందిరం36వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గోదాదేవి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. పట్టణ సీఐ వరంగంటి రవికుమార్ హాజరుకాగా, ఆలయ కమిటీసభ్యులు ఆయన్ను సన్మానించారు. లక్షపుష్పార్చనలను వైభవంగా చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా సప్తదశ బ్రహ్మోత్సవాలు

జమ్మికుంట, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వెంకటాద్రినగర్‌లో గల శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో సప్తదశ బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభించారు. ఆలయచైర్మన్ ముక్క జితేందర్‌గుప్తా మాట్లాడుతూ ఈనెల 7నుంచి సప్తదశ బ్రహ్మోత్సవాలు ప్రారంభం అయ్యాయని, 12వతేదీ వరకు జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

నేడు పట్టభద్రుల సమావేశం

హుజూరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సిటీ సెంట్రల్‌హాల్‌లో ఆదివారం పట్టభద్రుల సమావేశం నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్‌నాయకులు శనివారం ఒకప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్‌లు హాజరవుతారని పేర్కొన్నారు.

'అంబేద్కర్ స్ఫూర్తికి విఘాతం'

హుజూరాబాద్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహం చుట్టూ వివిధ రాజకీయ పార్టీల జెండాలు, తోరణాలు కట్టి అంబేద్కర్‌కు ఉన్న స్ఫూర్తికి భంగం కలిగిస్తూ అవమానిస్తున్నారని అంబేద్కర్, పూలే జయంతి కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి ఏ రాజకీయ పార్టీ జెండాలు కట్టకుండా నియంత్రించి, అంబేద్కర్ పవిత్రతను పరిరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఖాలీద్ హుస్సేన్, ఉప్పు శ్రీనివాస్, గూడూరు స్వామిరెడ్డి, రమేష్, వేల్పుల రత్నం, తులసి లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

గుండి చెరువుకు శాశ్వతంగా నీరందించేందుకు కృషి: ఎమ్మెల్యే

రామడుగు, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండి గ్రామంలోని చెరువుకు ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కాలువల ద్వారా శాశ్వతంగా నీరు అందేలా చర్యలు తీసుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం రైతులకు హామీ ఇచ్చారు. గుండి చెరువు సమస్యను శనివారం రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. గుండి చెరువును నీటినినింపితే వ్యవసాయ బావుల్లోకి నీరుచేరి ఆయకట్టు మండలంతో పాటు చొప్పదండి గ్రామాల రైతులు వేసవిపంట పండించుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. స్పందించిన ఆయన చెరువుకు శాశ్వతంగా నీరు అందేలాచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామానికి చెందిన జాలి మల్లారెడ్డి భార్య ఇటీవల మృతిచెందగా మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉండి కుటుంబపరిస్థితి దీనంగా మారింది. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించి వెంటనే ఆర్థిక సహాయం అందజేశారు.



ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే

'ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరండి'

చొప్పదండి, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరంలో తమ కళాశాలలో చేరాలని చొప్పదండి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌బాబు విద్యార్థులను కోరారు. అడ్మిషన్ ప్రక్రియలో భాగంగా చొప్పదండి జడ్పీ బాలుర, బాలికల ఉన్నతపాఠశాల, రాగంపేట, వెదురుగట్టు, జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో సమావేశమై తమ కళాశాలలో చేరాలని కోరారు.

మహిళా కాంగ్రెస్ కమిటీల్లో స్థానం

చొప్పదండి/హుజూరాబాద్/జమ్మికుంట, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌పార్టీ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శిగా గుంటి స్వరూపను, ఉపాధ్యక్షురాలిగా హుజూరాబాద్ పట్టణానికి చెందిన లంకదాసరి లావణ్యను, జమ్మికుంట పట్టణానికి కాంగ్రెస్‌పార్టీ మహిళా అధ్యక్షురాలిగా రేణుకను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షురాలు మొగిలి సునీతరావు, జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. తమ నియామకానికి సహకరించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మంత్రి పొన్నంప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యానా రాయణ, హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జీ వొడితెల ప్రణవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా మంద జ్యోతి

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ధర్మసమాజ్‌పార్టీ అభ్యర్థిగా మంద జ్యోతి పేరును రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహరాజ్ ప్రకటించినట్లు రాష్ట్ర కార్యదర్శి చిలువేరు శ్రీకాంత్ తెలిపారు. శనివారం నగరంలోని ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

దరఖాస్తుల ఆహ్వానం

తిమ్మాపూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎల్ఎండీ కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యాశిక్షణాసంస్థ(డైట్)లో ఖాళీగా ఉన్న బోధనాసిబ్బంది తాత్కాలిక నియామకానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరామ్ మొండయ్య శనివారం ఒకప్రకటనలో తెలిపారు. తెలుగు, ఆంగ్లమాధ్యమాల్లో బోధించే విజ్ఞానశాస్త్ర బోధన పద్ధతులు, కళా విద్యలో ఖాళీలు ఉన్నాయన్నారు. ఉర్దూ మాధ్యమంలో బోధించే సైకాలజీ, ఫిలాసఫీ, సాంఘిక శాస్త్రబోధన పద్ధతులలో ఖాళీలు ఉన్నట్లు తెలిపారు. పైనతెలిపిన పోస్టులకు పోస్ట్‌గ్రాడ్యుయేషన్, ఎంఈడీ కలిగి ఉండాలన్నారు. దరఖాస్తు చేసుకునేవారు సంబంధిత మెథడాలజీ బీఈడీ పూర్తి చేసి ఉండాలి. ఆసక్తి,అర్హతకలిగిన పదవీవిరమణ పొందినవారు, నిరుద్యోగులు ఈనెల14న సాయంత్రం 5గంటలలోగా ఎల్ఎండీ కాలనీలో గల డైట్ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

నష్టాల్లోంచి లాభాల బాటలోకి

● రైతుల ముంగిట్లో జూపాక సొసైటీ



జూపాక ప్రాథమిక సహకార సంఘం

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 8(ఆంధ్రజ్యోతి): నష్టాల ఊబిలో ఉన్న జూపాక ప్రాథమికసహకార సంఘాన్ని కొత్తపాలకవర్గం సవాల్‌గా తీసుకొని అభివృద్ధి చేసింది. లాభాల బాట పట్టించింది. అప్పట్లో ధాన్యం కొనుగోలుకు కూడా ప్రభుత్వం అనుమతించలేదు. ఆ తర్వాత నూతన పాలకవర్గం బాధ్యతలు స్వీకరించిన తరువాత సొసైటీ అభివృద్ధిపై దృష్టి పెట్టింది.సొసైటీ కింద కనుకులగిద్దె, రాజపల్లి, బొత్తలపల్లి, చెల్పూర్, జూపాక, శాలపల్లి-ఇందిరానగర్ గ్రామాలు ఉన్నాయి.

● రైతులకు అంబాటులో యూరియా, ఎరువులు

ఈ ఆరు గ్రామాల్లో 6లక్షల క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోలు చేయగా, రూ.1.62కోట్ల కమిషన్ వచ్చింది. దీంతోపాటు రైతులకు ఆయాగ్రామాల్లో డీఏపీ, యూరియా, పొటాష్ తదితర ఎరువులను విక్రయించారు. ఈ సొసైటీలో 2400మంది రైతుల సభ్యత్వం ఉండగా, 628మంది రైతులకు రూ.5.07కోట్ల రుణాలు అందించారు. రూ.3.30కోట్ల దీర్ఘకాలిక రుణాలు కూడా ఇవ్వడంతో లాభాల బాటలో పడింది. ప్రస్తుతం చెల్పూర్‌లో నాబార్డు సహకారంతో రూ.51లక్షలతో నూతన బిల్డింగ్‌ను నిర్మించారు. ఇక్కడి నుంచే రైతులకు కావాల్సిన రుణాలు, ఎరువులు ఇవ్వనున్నారు.

● రైతుల సహకారంతో ముందుకెళ్తున్నాం.

- అలుమల్ల శ్యాంసుందర్‌రెడ్డి, చైర్మన్, జూపాక సొసైటీ



రైతుల సహకారంతో జూపాకసొసైటీని లాభాల బాటల్లోకి తీసుకువచ్చాం. గతంలో తమ సొసైటీలో అవినీతి జరుగగా, కొనుగోలు కేంద్రాలకు అవకాశం ఇవ్వలేదు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి ఆరుగ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతుల నుంచి 6లక్షల క్వింటాళ్ల వరిధాన్యం కొనుగోలు చేశాం. అందులో రూ.1.62కోట్ల కమీషన్ సొసైటీకి వచ్చింది.

బీజేపీ నాయకుల సంబరాలు



హుజూరాబాద్‌లో సంబరాలు జరుపుకుంటున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్/ఇల్లందకుంట/గంగాధర, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో జరిగిన ఎన్నికల్లో బీజేపీ ఘనవిజయం సాధించడంపై మండలాల్లో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. టపాసులుకాల్చి, స్వీట్లు పంపిణీచేశారు. హుజూరాబాద్‌లో బీజేపీ పట్టణాధ్యక్షుడు తూర్పాటి రాజు, గంగిశెట్టి రాజు, ఇల్లందకుంట బీజేపీమండలాధ్యక్షుడు బైరెడ్డిరమణారెడ్డి, ఆరెల్లిశ్రీనివాస్, గురుకుంట్ల సాంబయ్య, రాంబాబు, గంగాధర మండలంలో బీజేపీ మండలాధ్యక్షుడు పంజాల ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మత్స్యగిరీంద్ర స్వామి కల్యాణం

సైదాపూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెన్నంపల్లి గ్రామంలో మత్స్యగిరీంద్రస్వామి కల్యాణం శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు శేషం శేషాచార్యులు, శేషం వేంకట రమణాచార్యుల మంత్రోచ్ఛరణల మధ్యశ్రీభూదేవి, నీలాదేవి సమేత మత్స్యగిరీంద్ర స్వామి కల్యాణం జరిగింది. స్వామి కళ్యాణం తిలకించేందుకు భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఆలయం వద్ద చైర్మన్ సారబుడ్ల వెంకటరెడ్డి ఏర్పాట్లు చేశారు.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

ఎమ్మెల్యే చిత్రపటానికి క్షీరాభిషేకం

మానకొండూర్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిజాయితీగూడెం నుంచి తిమ్మాపూర్ మండలంలోని మన్నెంపల్లి గ్రామానికి రోడ్డు నిర్మాణానికి రూ.6.11 కోట్లను ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మంజూరు చేయించారు. దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం గ్రామస్థులు ఆయన చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

'ముందు వరుసలో ఉండటం సంతోషంగా ఉంది'

జమ్మికుంట రూరల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆస్తిపన్నుల వసూళ్లలో రాష్ట్రంలో ముందు వరుసలో ఉండటం సంతోషంగా ఉందని మున్సిపల్ కమిషనర్ మొహమ్మద్‌ఆయాజ్ అన్నారు. శనివారం జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ మాట్లాడుతూ 2024-25సంవత్సరానికి సంబంధించిన పన్నులవసూళ్లలో 12.5జీడీపీ సాధించి, 15,16వ ఆర్థికసంఘంనిధులకు అర్హత సాధించామన్నారు. మార్చినెల చివరివరకు పూర్తిస్థాయిలో పన్నుల వసూళ్లు చేపడుతామన్నారు. తమకు సహకరించిన మాజీచైర్మన్, మాజీ వైస్‌పర్సన్, కౌన్సిలర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.